క్లుప్తంగా

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో న్యాయవాదుల నిరసనలు కొనసాగుతున్నాయి. జిల్లా కోర్టులో అడ్వకేట్స్ అమెండ్మెంట్ బిల్– 2025 అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఫెడరేషన్ తీసుకున్నా నిర్ణయంలో భాగంగా గుంటూరు జిల్లా కోర్టులో ఈనెల 24, 25 తేదీలలో న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరవుతున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకట రెడ్డి శనివారం తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్మాగ్రహ దీక్ష

లక్ష్మీపురం: రాష్ట్రంలో దిగజారిపోతున్న నైతిక విలువలు నిరంతరాయంగా జరుగుతున్న అత్యాచారాలు హత్యలకు నిరసనగా ఈనెల 24వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్మాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు (సంగమ్) శనివారం తెలిపారు. నైతిక విలువల పట్ల జాగరూకత వ్యవస్థ బాధ్యత అని గుర్తించాలన్నారు.

మాజీమంత్రి వడ్డేకు ధర్మజ్యోతి పురస్కారం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం స్వధర్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరావుకు ధర్మజ్యోతి –2025 పురస్కారాన్ని అందించారు. సంస్థ అధ్యక్షులు కొరప్రాటి రామారావు అధ్యక్షత వహించారు. మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, నన్నపనేని రాజకుమారి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణ, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, సంస్థ కార్యదర్శి తూనుగుంట్ల సుందరరామయ్య పాల్గొన్నారు.

అంతర్జాలంలో తెలుగును విరివిగా ఉపయోగించాలి

లక్ష్మీపురం: నాణ్యమైన చదువులకు మాతృభాష మాధ్యమమే కీలకమని ప్రపంచవ్యాప్తంగా జరిగిన, జరుగుతున్న పరిశోధనలు తేల్చి చెబుతున్న నేపథ్యంలో అమ్మ భాషలో అభ్యసనం ఎందుకు వెనక పడుతుంది అందరూ ఆలోచించాలి అని కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు సూర్యలక్ష్మీ, శోభ, రచయిత్రి టి. పద్మావతి లు ప్రసంగించారు.

సమ్మిట్‌కు ఏఎన్‌యూ విద్యార్థులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూత్ క్లైమేట్ కంక్లేవ్ ఐదో ఎడిషన్ మార్చి 2 నుండి మార్చి 4 వరకు నేషనల్ ఈవెంట్, వరల్డ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ సమ్మిట్ (డబ్ల్యూ ఎస్ డి ఎస్) 2025 మార్చి 5 నుంచి 7 వరకు న్యూఢిల్లీలో జరుగుతుందని ఈ కాంక్లేవ్ కు ఇంజినీరింగ్ కళాశాల నుండి ముగ్గురు విద్యార్థినులు ఎంపిక అయ్యారని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ తాసీఫ్ అహ్మద్ శనివారం తెలియజేశారు. మూడో సంవత్సరం ట్రిబుల్ ఈ విద్యార్థిని బి. జాహ్నవి, ఏ ఎం ఎల్ రెండో సంవత్సరం విద్యార్థిని సి.నవ్య, రెండో సంవత్సరం ఎంఎల్‌కు చెందిన విద్యార్థిని జి.మేఘన. వీరిని విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.గంగాధర్ అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్టర్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపల్ పి.సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం .గోపికృష్ణ డాక్టర్ ఎస్.చంద్రమౌళి. కె. చైతన్య, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఏలకు, విద్యార్థులకు సేవలు అందిస్తాం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరుశాఖ నూతన భవన నిర్మాణాన్ని సాకారం చేసి చార్టర్డ్ అకౌంటెంట్లకు, విద్యార్థుల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామని ఐసీఏఐ ఉపాధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ చెప్పారు. శనివారం అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో ఐసీఏఐ గుంటూరు శాఖ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి కేంద్రంగా ఐసీఏఐ న్యూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో ఐసీఏఐ కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, ముప్పాళ్ల శ్రీధర్, ఎస్ఐఆర్‌సీ కార్యదర్శి ఎర్ర తిరుపతయ్య, గుంటూరు శాఖ కార్యదర్శి వనిమిరెడ్డి వెంకట నరేష్, వైస్ చైర్మన్ రుద్రవరపు భరద్వాజ్, కోశాధికారి మృత్యుంజయరావు, సికాస చైర్మన్ రాజశేఖర్ నాగబీరు, సభ్యులు షేక్ బాజీ, దేసు సంపత్, పాస్ట్ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, సీఏలు పాల్గొన్నారు.

లయ తప్పుతున్న హృదయం

- అధికమవుతున్న గుండెపోటు మరణాలు
- యువత సైతం గుండెపోటు బారిన పడుతున్నారు
- హార్ట్ ఎటాక్‌పై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలి

గుంటూరు మెడికల్: కామారెడ్డి జిల్లా రమారెడ్డి మండలం సింగరాయపల్లెకు చెందిన శ్రీనిధి (14) ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం పాఠశాలకు నడుచుకుంటూ వెళుతూ ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందింది. వైద్యులు హార్ట్ ఎటాక్‌తో విద్యార్థిని మృతిచెందినట్లు నిర్ధారించడంతో ఆ కుటుంబ సభ్యులు తీరని సోకానికి గురయ్యారు.

ఒత్తిడితో కూడిన ఆధునిక జీవన శైలి వల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మొదలు, కాలేజీ యువత, ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం మూడు పదుల వయస్సు దాటకుండానే కొన్ని సందర్భాల్లో కనీసం రెండు పదులు దాటకుండానే అకాల మృత్యువుకు గురవుతున్నారు. కాలేజీలకు వెళ్లిన యువత తరగతి గదుల్లోనే గుండెపోటుతో కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలిన సంఘటనలు ఇటీవల కాలంలో చోటు చేసుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా నంబర్ వన్ కిల్లర్‌గా పిలువబడే గుండె జబ్బులు వయస్సుతో సంబంధం లేకుండా వస్తున్నాయి. హార్ట్ ఎటాక్‌కు వయస్సు సంబంధం లేకుండా అందరూ చనిపోవడం చాలా బాధాకరం. అయితే హార్ట్ ఎటాక్ లక్షణాల గురించి తెలుసుకుని ముందస్తుగా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని కార్డియాలజిస్టులు వెల్లడిస్తున్నారు.



గుండె లయతప్పితే..

హార్ట్ ఎటాక్ నేడు ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటోంది. చిన్నా పెద్ద తేడా లేకుండా.. పేద వారు, ధనికులు అనే బేధం లేకుండా అందరూ కూడా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. హార్ట్ ఎటాక్‌కు గురైన వారికి తక్షణమే గుండె మసాజ్ చేసి ప్రాణాలు కాపాడవచ్చని కార్డియాలజిస్టులు తెలియజేస్తున్నారు. అయితే దీనిపై కొద్దిపాటు అవగాహన ఉంటే మరణాలు కొంత వరకు తగ్గించవచ్చని గుండె వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

అసలు గుండెపోటు అంటే..

గుండెలో రక్తనాళాలు సడన్‌గా మూసుకుపోతాయి. దీంతో గుండెకు రక్తం సరఫరా ఆగిపోయి పనిచేయటం ఆగిపోతుంది. దీనినే గుండెపోటుని పిలుస్తారు. ఇదే సడన్‌గా చనిపోవటాన్నే హార్ట్ ఎటాక్ అంటారు.

జీజీహెచ్‌లో బాధితుల చికిత్స

గుంటూరు జీజీహెచ్‌లో గుండె జబ్బులతో బాధపడుతూ 2022లో ఓపీ వైద్య విభాగంలో 10,984 మంది, 2023లో 14,577 మంది, 2024లో 24,420 మంది చికిత్స పొందారు.

ఎవరికి హార్ట్ ఎటాక్ రావొచ్చు

- కోవిడ్ అనంతరం ఈ మధ్య కాలంలో యువకుల్లో కూడా గుండెపోటు ఎక్కువగా వస్తుందని కార్డియాలజిస్టులు చెబుతున్నారు.
- ధూమపానం చేసేవారిలో ఎక్కువగా హార్ట్ ఎటాక్ వస్తుంది.
- కుటుంబంలో ఎవరికైనా గుండెజబ్బు ఉన్నా వారి పిల్లలకు వస్తుంది.
- మద్యపానం, పని ఒత్తిడి, మానసిక ఆందోళన, అధిక కొవ్వు కల్గిన పదార్థాలు తినే వారు, వ్యాయామం చేయని వారు, ఊబకాయం, బీపీ, షుగర్ ఉన్నవారు హార్ట్ ఎటాక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

లక్షణాలు ఇలా..

హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి గుండె బరువుగా ఉంటుంది. పెద్ద బరువు గుండెపై పెట్టినట్లుగా అనిపిస్తోంది. సడన్‌గా మనిషి కిందకు పడిపోతారు. ఛాతిలో మంట, గొంతు పట్టినట్లు ఉండటం, దవడలు లాగుట, ఎడమ లేదా రెండు భుజాలు లాగుట, కడుపులో నొప్పి, మంట, శరీరం అంతా చెమటలు పట్టడం, ఆయాసం, భయం వంటి లక్షణాలు ఉంటాయి. ఛాతిలో మంట నడిస్తే ఎక్కువగా ఉంటుంది. నడక ఆపి కూర్చుంటే తగ్గిపోతుంది. గుండె పోటు కూడా గ్యాస్ట్రబుల్ లాగా అనిపిస్తోంది. చాలా మంది గ్యాస్ట్రబుల్ అనుకుని మాత్ర వేసుకుని మిన్నకుండి పోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గ్యాస్ మాత్ర వేసుకున్నా ఛాతిలో మంట తగ్గకపోతే తక్షణమే ఈసీజీ పరీక్ష చేయించుకుని గుండె వైద్యులను సంప్రదించాలి.

ముందస్తుగా గుర్తించవచ్చు



గుండె పోటు వచ్చే అవకాశం ఉందా లేదా అనే విషయాన్ని ముందస్తుగానే గుర్తించే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. హార్ట్ ఎటాక్ వచ్చి కుప్పకూలిపోయిన వారికి ఛాతిపై రెండు చేతులు పెట్టి నిమిషానికి 30 సార్లు కార్డియాక్ మసాజ్ (సీపీఆర్) చేయటం ద్వారా ఆగిన గుండెను తిరిగి కొట్టుకునేలా చేయవచ్చు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండే గుండె మరణాలు తగ్గించవచ్చు.

–డాక్టర్ అంజిత్ ఉప్పుటూరి, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు.

రాకుండా ముందస్తు జాగ్రత్తలు



హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు, కుటుంబంలో ఎవరికైనా గుండెజబ్బు ఉన్నవారు తప్పనిసరిగా ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండటంతోపాటుగా యోగా, ధ్యానం చేయాలి. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. బయట ఆహార పదార్థాలు, నూనె వస్తువులు తీసుకోవటం తగ్గించి ఇంటి వంటకు ప్రాధాన్యత ఇవ్వాలి.

–డాక్టర్ పోలవరపు అనురాగ్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు.

కూటమి పాలనలో ముస్లింలకు అన్యాయం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి
- ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతన బకాయిలివ్వాలని డిమాండ్

పట్నంబజారు: రాష్ట్రంలోని ముస్లింలకు, ముఖ్యంగా ఇమామ్, మౌజాన్‌లకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజాన్‌లకు రూ. 5 వేల చొప్పున నెలకు ఇచ్చేవారని గుర్తుచేశారు. 2024 ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు వారికి గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. రూ. 90 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం సగమే ఇచ్చేందుకు జీవో జారీ చేయడం అన్యాయమన్నారు. రానున్న రంజాన్ మాసంలో ఎక్కువ ఖర్చులు ఉంటాయని, ప్రభుత్వం మిగిలిన మొత్తం కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో హజ్ యాత్రకు వెళ్లే వారికి విజయవాడ నుంచి టికెట్ ధరలు ఎక్కువగా ఉంటే ఆ భారాన్ని ప్రభుత్వమే భరించేలా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులిచ్చారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ మాత్రమే వ్యతిరేకించిన విషయం మర్చిపోవద్దన్నారు. రాష్ట్రంలో 3,529 మందిని ఒకేసారి హజ్‌కు పంపిన ఘనత జగనన్నకే దక్కుతుందని స్పష్టం చేశారు. డీబీటీ, నాన్ డీబీటీ పద్ధతుల్లో ముస్లిం మైనారిటీలకు రూ.23 వేల కోట్లు అందించిన మంచి మనసున్న వ్యక్తి వైఎస్ జగన్ అని ప్రశంసించారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి

- సమన్వయంతో కృషి చేయాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో వార్డ్ సచివాలయాల వారీగా పక్కాగా అమలు చేయడానికి వార్డు అడ్మిన్ కార్యదర్శి నేతృత్వంలో కార్యదర్శులందరూ సమన్వయంతో కృషి చేయాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులకు స్పష్టం చేశారు. శనివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డ్ సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, వివిధ సర్వేల పురోగతిపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల విజయవంతానికి సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు సకాలంలో అందించడం, వివిధ సర్వేలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం డివిజన్ల వారీగా నోడల్ నియమించిన నోడల్ అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమాని స్పష్టం చేశారు. అనంతరం కార్యదర్శుల వారీగా మిస్సింగ్ సిటిజెన్స్, హౌసింగ్ జియోట్యాగ్, ఎన్సీసీఏ, నాన్ రెసిడెంట్ ఇన్ ఏపీ, ఎంఎస్‌ఎంఈ సర్వేల పురోగతిపై వివరాలడిగి తెలుసుకొని, మాట్లాడుతూ సోమవారానికి సర్వేలన్నీ పూర్తి చేయాలని సర్వేలను క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివారావు, పి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సి.ఎం.ఓ.హెచ్.డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పీఓ రామారావు, గుంటూరు తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు, నోడల్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రక్షణ బాధ్యత డ్రైవర్లదే



శిక్షణ ముగించుకున్న డ్రైవర్లతో ఆర్‌ఎం ఎం.రవికాంత్

పట్నంబజారు: రోడ్డు భద్రతా నియమాలను డ్రైవర్లు పాటించటం ద్వారానే ప్రయాణికులకు సురక్షితంగా గమ్యాన్ని చేర్చగలరని ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం. రవికాంత్ చెప్పారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ ముగించుకున్న 18వ బ్యాచ్ వారికి ధ్రువీకరణ పత్రాలను ఆయన శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లోని డ్రైవింగ్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ప్రయాణికుల రక్షణ బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. 19వ బ్యాచ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 88973 71003 ఫోను నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిపో 2 మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్‌సలాం తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ డెవలప్‌మెంట్, డిజైనింగ్‌పై ముగిసిన వర్క్‌షాప్



డ్రోన్ డెవలప్‌మెంట్, డిజైనింగ్‌పై శిక్షణ పొందిన విద్యార్థులతో సుబ్బారావు, నర్సిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రోన్ డెవలప్‌మెంట్ అండ్ డిజైనింగ్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మానవ అవసరాలకు ప్రతి రంగంలో డ్రోన్ల వినియోగం పెరిగిందని, తద్వారా తక్కువ సమయంలో మరింత మెరుగైన ఫలితాలను పొందవచ్చని అన్నారు. విద్యార్థులకు ప్రస్తుత కాలంలో ఉన్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్‌కు చెందిన అట్రెస్ స్మార్ట్ సంస్థ ప్రాజెక్ట్ హెడ్ సూర్యప్రకాష్, మెంబర్ ప్రశాంత్ ఆధ్వర్యంలోవర్క్ షాప్ ను నిర్వహించినట్లు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో భాగంగా విద్యార్థులు డ్రోన్ డిజైన్, డెవలప్‌మెంట్, ఆపరేట్ చేసే విధానాన్ని నేర్చుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో కళాశాలలో చదువుతున్న విద్యార్థులే స్వయంగా డ్రోన్లను తయారుచేసి ఉపయోగించే నైపుణ్యాన్ని పొందారని అన్నారు. వర్క్‌షాప్ కో–ఆర్డినేటర్ సూదా కృష్ణార్జునరావు మాట్లాడుతూ సాంకేతిక నిపుణుల సమక్షంలో విద్యార్థులు డ్రోన్లను తయారు చేసే విధానంలో సలహాలు, ప్రయోగించే విధానంలో మెలకువలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారన్నారు. వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ కె.మధుసూదనరావు, విభాగాధితులు వి.రమాదేవి, పీఏ స్నేహలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి గొప్ప విజయాలను సాధించాలి

మట్టుపల్లి మోహన్



విద్యార్థినికి జ్ఞాపిక అందజేసిన మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టుదలతో చదివి జీవితంలో గొప్ప విజయాలను సాధించాలని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ పేర్కొన్నారు. జీకేఆర్ విద్యాసంస్థలు ఏటీ అగ్రహారం, పట్టాభిపురం క్యాంపస్‌లలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ శనివారం సాయంత్రం ఫేర్‌వెల్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, సత్ప్రవర్తన ఎంతో ముఖ్యమని అన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను గుర్తెరిగి, గురువుల బోధనలో మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. ఆరోగ్య హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కె.రవికుమార్ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని పదిలంగా చూసుకోవాలని, సమయానికి మంచి ఆహారాన్ని తీసుకుని, తగినంత నిద్ర పోవాలని సూచించారు. తద్వారా పరీక్షలు చక్కగా రాయగలరన్నారు. పాఠశాల డైరెక్టర్లు కొండారెడ్డి, జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తీసుకురావాలని ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సుశీల, శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యారంగాభివృద్ధిలో అజాద్ సేవలు చిరస్మరణీయం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



పట్నంబజారు: విద్యారంగ వ్యవస్థను పటిష్టం చేసిన మహనీయుడు మౌలానా అబుల్‌కలాం అజాద్ అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. అబుల్‌కలాం అజాద్ వర్ధంతి పురస్కరించుకుని మంగళదాస్‌నగర్‌లోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్‌కలాం అజాద్ అందించిన సేవలు మరువలేనివన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కోర్టులో లొంగిపోయిన చిట్ ఫండ్స్ కంపెనీ నిర్వాహకులు

గుంటూరు లీగల్: ఓ ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీ ప్రతినిధులు శనివారం కోర్టులో లొంగిపోయారు. చిట్‌ఫండ్ నిర్వాహకులు, అతని తనయుడు స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కం ఎక్సైజ్ కోర్టులో లొంగిపోయారు. చిట్‌ఫండ్ కంపెనీ నిర్వాహకులకుపై గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో క్రైమ్ 60/20 కేసు నమోదైంది. ఈ కేసులో విచారణలో ఉండగా, నిర్వాహకులు శనివారం కోర్టులో లొంగిపోయారు. నిందితులను రిమాండ్ పంపుతూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణ మార్చి 7కు వాయిదా వేశారు. ఈ కేసులో మొత్తం ఐదుగురు నిందితులు ఉన్నారు.

బుర్ర కథలతో నాజర్ ఉద్యమం

నెహ్రూనగర్: పేదల కోసం బుర్రకథ ద్వారా జాతీయ స్థాయిల్లో ప్రజలను ఉద్యమం వైపు నడిపించిన గొప్ప మేధావి పద్మశ్రీ షేక్ నాజర్ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవాసంగం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నాజర్ వర్ధంతి పురస్కరించుకుని యానాది కాలనీల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలను బుర్ర కథలతో చైతన్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బి.ఆర్. భగత్‌సింగ్, సాంబయ్య, రమాదేవి, నీలాంబరం, మాధవీ లత, విజయలక్ష్మి, బత్తుల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీమార్ట్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన 17 మంది ఎంబీఏ విద్యార్థులు ఇటీవల డీ–మార్ట్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింగరాజు వెంకట రమణ తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు కళాశాలలోని ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి, కార్పొరేట్ ప్రపంచంలో పోటీకి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తద్వారా పారిశ్రామిక, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలను సాధిస్తున్నారని వివరించారు. ఏఎన్‌యూ వాణిజ్య విభాగ డీన్ ఆచార్య ఆర్. శివరామప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు అకడమిక్ థియరీతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను అభివృద్ధి పరచుకోవడం తప్పనిసరన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కె.రామకృష్ణ

కొరిటెపాడు: బ్యాంకింగ్ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఇదే డిమాండ్‌తో ఈ నెల 24, 25వ తేదీల్లో చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అనుబంధంగా ఉన్న ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశం శనివారం గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. కార్యవర్గ సమావేశాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ, ఏపీ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి యూనియన్ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ అన్ని బ్యాంకుల్లో లక్షల ఖాళీలు ఉన్నాయని, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని ప్యారీ స్కూల్ ఆఫ్ కామర్స్, కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎ.వెంకటాచలం బ్యాంకింగ్ సేవలలో ఆల్ అప్లికేషన్ – ఎథికల్ గవర్నెన్స్, విజిలెన్స్ అనే అంశంపై ప్రసంగించారు. ఏఐటీయూసీ ఏపీ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ రాధాకృష్ణ మూర్తి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజిరెడ్డి వజ్రాల మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం–ప్రజాస్వామ్యం– కార్మిక సంఘాల పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్, గుంటూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో ఉయ్యాలవాడ వర్ధంతి



నరశింహారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరశింహారెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులపై మొదటిగా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన యోధుడు ఉయ్యాలవాడ అని కొనియాడారు. సామాజిక విజ్ఞాన పీఠాధిపతి డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం సాయుధ యుద్ధంలో అతనిని ఎదుర్కొలేమని భావించి అతనిని పట్టించినవారికి వేల రూపాయల బహుమతిని ప్రకటించిందంటే ఆయన పోరాట పటిమను అర్థం చేసుకోవచ్చని కొనియాడారు. అనంతరం ఉయ్యాలవాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, డైరెక్టర్ డాక్టర్ రాధిక పాల్గొన్నారు.

అంబేడ్కర్ వారసులుగా యువత ఎదగాలి

ముగింపు సభలో ఆచార్య నాలాది శామ్యూల్



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆచార్య నాలాది

ఏఎన్‌యూ: ఏ దేశంలోనైనా మత విభేదాలు ఉన్నట్లయితే ఆ దేశం అభివృద్ధికి దూరంగా ఉండటంతో పాటు దేశ నిర్మాణం కూడా జరగదని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలాది శామ్యూల్ అన్నారు. విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా 'అంబేడ్కర్ విజన్ ఆన్ ఇంటర్ప్లే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా' అనే యూజీసీ జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆచార్య శామ్యూల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలా దేశాలు అభివృద్ధికి నోచుకోని స్థితిలో ఉన్నాయంటే అక్కడ అంబేడ్కర్ వంటి మహానుభావులు రాసిన రాజ్యాంగం లేకపోవడమే కారణమన్నారు. అంబేడ్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ సదస్సుకు 40 పరిశోధన పత్రాలు వచ్చాయని, పరిశోధన పత్రాల్లో సూచించిన విధంగా ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నటు వెల్లడించారు. సదస్సులో భారతి దాసన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ వెంకటాచలం మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు దేశం ఎప్పుడు రుణపడి ఉంటుందన్నారు. డాక్టర్ మద్దూ అంకయ్య మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను అమలు పరచాలంటే ప్రతి ఒక్కరు సమానత్వ భావన చూపాలన్నారు. డాక్టర్ భవాని, డాక్టర్ లావణ్యలు మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవబట్టే తాను ఉన్నత స్థితిలో నిలిచినట్లు చెప్పారు. బాబు జగజ్జీవన్ రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ను నాలెడ్జ్ శిఖరంగా అభివర్ణిస్తారని, కానీ మన దేశంలో ఆయనకు ఎంతవరకు ప్రాధాన్యత ఇస్తున్నామో గుర్తు చేసుకోవాలన్నారు. అంబేడ్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సదస్సు కోశాధికారి డాక్టర్ కె. అబ్రహం లింకన్, పరిశోధకులు బి. కోటి యాదవ్, రంగనాథ్, రత్న శేఖర్, అనురాధ, అభిషేక్, బాజీ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు ఈస్ట్)

90109 57733

Office mail : sakshigntadvt@gmail.com